సేంద్రియ సాగును ప్రోత్సహించాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మేళాను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 8: సేంద్రియ సాగును ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం నగరంలోని టీడీపీ కార్యాలయం పక్కన గల సమీకృత కూరగాయల మార్కెట్ ఆవరణలో గ్రామభారతి, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ మేళాను మంత్రి ప్రారంభించారు. సేంద్రీయ సాగును ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆర్గానిక్ మేళాను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, మేయర్ నీరజ, కార్పొరేటర్లు మంజుల, నరేందర్, నీరజ, నారాయణరావు, రైతులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌కు కాకర్లపల్లి విద్యార్థుల ఎంపిక

సత్తుపల్లి టౌన్: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 8: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు మండలంలోని కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లాలో మొత్తం 100 మంది విద్యార్థులను ఎంపిక చేయగా వారిలో సత్తుపల్లి మండలానికి చెందిన వారు 33 మంది ఎంపికయ్యారు. ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి 4 సంవత్సరాల పాటు సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందించనున్నారు. విద్యార్థులను హెచ్ఎం, సత్తుపల్లి ఎంఈవో ఎన్.రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు మేడా సత్యనారాయణ, జల్లిపల్లి మురళీ, నాతి రమేశ్ అభినందించారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపికైన మాటూరు విద్యార్థులు

మధిర: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

మధిర, ఫిబ్రవరి 8: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు మండలంలోని మాటూరు ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు గుడ్ల శ్యామ్‌కౌశిక్, దేవిశెట్టి సుమలిక ఎంపికయ్యారని హెచ్ఎం చెరుపల్లి శ్రీహరి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థి పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలని, భవిష్యత్‌లో కఠిన పోటీ పరీక్షల్లో సైతం ధీటుగా ఎదుర్కోగలుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వై.ప్రభాకర్, ఉపాధ్యాయులు దీవిసాయి కృష్ణమాచార్యులు, సంక్రాంతి శ్రీనివాసరావు, కొలనగా ప్రసాదరావు, మేడేపల్లి శ్రీనివాసరావు, చౌడవరపు సునీత, రెంటపల్లి భాగ్యశ్రీనివాసరావు, షేక్ ఇబ్రహీం, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, లావుడ్య రవికుమార్, ఎం.వరప్రసాద్, పగిడిపల్లి ఇస్సాక్, పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపికైన వేద వర్షిత

వైరా టౌన్: వేద వర్షితను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

వైరాటౌన్, ఫిబ్రవరి 8: వైరాలోని 6వ వార్డుకు చెందిన చీదిరాల వేద వర్షిత ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన ఎన్ఎంఎంఎస్(నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్)కు ఎంపికైంది. వేద వర్షిత వైరాలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతుంది. వేద వర్షితను జడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం, వెంకట మల్లేశ్వరి, ఉపాధ్యాయులు గాయత్రి, సరళ, రమాదేవి, నాగమణి, సుశీల, రాణి, రామలక్ష్మి అభినందనలు తెలిపారు.

ఘనంగా వీవీసీ హైస్కూల్ వార్షికోత్సవం

చిన్నారుల నృత్య ప్రదర్శనలు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 8 : ఖమ్మం నగరంలోని వీవీసీ హైస్కూల్ వార్షికోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. చిన్ననాటి నుంచే ఉన్నతమైన లక్ష్యాన్ని ఎంచుకొని సాధించే దిశగా ముందుకు సాగాలని ఎంపీ సూచించారు. నగర మేయర్ పునకొల్లు నీరజ, పాఠశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రేఖల భాస్కర్, ప్రిన్సిపాల్ విద్యుల్లత, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

శిశువులకు పోషకాహారం అందించాలి

కారేపల్లి, ఫిబ్రవరి 8: అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చే శిశువులకు అన్ని రకాల పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ గాంధీనగర్ సెక్టార్ సూపర్‌వైజర్ గీతాబాయి అన్నారు. మండల పరిధిలోని చర్లపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం గర్భిణులకు, చంటి పిల్లల తల్లులకు పోషకాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఎత్తు పొడవు, జబ్బ కొలతలు వేసి టీచర్లకు పలు సూచనలు చేశారు. కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, చిన్నారులకు నాణ్యమైన ఆహారాన్ని తయారు చేసి అందించాలన్నారు. బొక్కల తండా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారుల గ్రామానికి చెందిన అజ్మీర భార్గవి –ప్రశాంత్ కేంద్రానికి ఐదు కుర్చీలను సూపర్‌వైజర్ సమక్షంలో వితరణగా అందజేశారు. కుర్చీలు అందజేసిన అజ్మీర భార్గవి దంపతులకు సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్ కృతజ్ఞతలు తెలిపారు.

వేసవిలో తాగునీటి ఇబ్బంది రాకుండా చర్యలు

మిషన్ భగీరథ తాగు నీటిని పరిశీలిస్తున్న ఈఈ పుష్పలత

కూసుమంచి, ఫిబ్రవరి 8: వేసవి సమీపిస్తున్నందున గ్రామాల్లో ఎక్కడా మంచినీటి ఇబ్బందుకు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పుష్పలత అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె పర్యటించి అధికారులకు సూచనలు చేశారు. ఎక్కడెక్కడ తాగు నీటి సమస్యలున్నాయి, వాటిని ఎలా పరిష్కరించాలనే విషయంలో అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని, తాగు నీటి సమస్యలపై ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే పరిష్కరించాలన్నారు. గత సంవత్సరం తాగు నీటి ఇబ్బందులు వచ్చిన గ్రామాల్లో తిరిగి అలాంటి పరిస్థితి ఉత్పన్నం కాకుండా చూడాలన్నారు. ఈఈ వెంట జేఈ రంజిత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ముష్టికుంట్ల పాఠశాలకు మహర్దశ

మాట్లాడుతున్న అధికారులు, పాఠశాల విద్యార్థులతో అధికారులు

బోనకల్లు, ఫిబ్రవరి 8: మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలకు పీఎంశ్రీ పథకం కింద ఈ ఏడాది నుంచి నిధులు మంజూరు కావడంతో పాఠశాలకు మహర్దశ చేకూరనుంది. విద్యార్థులకు అన్ని రకాల వసతుల కల్పనతో పాటు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా విజ్ఞాన యాత్రలు, ఆదర్శ పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమాలు, విద్యాభివృద్ధి సాధించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలను అమలు చేయడమే లక్ష్యంగా పథకాన్ని అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం అధికారులు రావినూతల ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడ అమలయ్యే కార్యక్రమాలను పరిశీలించారు. తహసీల్దార్ ఏ.పున్నంచందర్, ఎంఈవో దామాల పుల్లయ్య, హెచ్ఎం భాగ్యలక్ష్మి, గిర్ధావర్ గుగులోత్ లక్ష్మణ్ విద్యార్థులకు పీఎం శ్రీ పథకం గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు నాలుగేళ్ల వ్యవధిలో కోటి రూపాయల వరకు నిధులను విడుదల చేస్తారు. ఈ నిధులతో ఇప్పటికే ముష్టికుంట్ల పాఠశాలలో విద్యార్థులను జిల్లాలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్‌కు తీసుకెళ్లారు. ఆదివారం విద్యార్థులను లక్నవరం చెరువు, రామప్పదేవాలయం, వెయ్యి స్తంభాల దేవాలయం, ఓరుగల్లు కోటను తీసుకెళ్లేందుకు గాను ఉపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు చేశారు. 9, 10 తరగతుల విద్యార్థులు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. దీంతో పాటు పాఠశాలలో ల్యాబ్, కిచెన్, గార్డెన్, డిజిటల్ బోధన పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. ఉపాధ్యాయులు, గ్రామస్తులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

వెంకయ్యకు కమల్‌రాజు నివాళి

వెంకయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న లింగాల కమల్‌రాజు, నాయకులు

బోనకల్లు, ఫిబ్రవరి 8: మండలంలోని చిన్నబీరవల్లి గ్రామంలో బుంగ లెనిన్ తండ్రి వెంకయ్య ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమలరాజు శనివారం చిన్నబీరవల్లిలోని స్వగృహానికెళ్లి వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నివాళి అర్పించిన వారిలో నాయకులు కాకాని శ్రీనివాసరావు, చెరుకు రామకృష్ణ, యన్నంశెట్టి అప్పారావు, అరిగె శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

పవన్‌సాయి (ఫైల్)

పెనుబల్లి, ఫిబ్రవరి 8: మండలంలోని లంకపల్లి గ్రామం వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండాలపాడు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి రావిరాల పవన్‌సాయి(19) శనివారం ఖమ్మంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతి

కొణిజర్ల, ఫిబ్రవరి 8: అనుమానాస్పద స్థితిలో ఆటోడ్రైవర్ మృతిచెందిన ఘటన మండలంలోని గోపవరం గ్రామ సమీపంలో నేషనల్ హైవే బ్రిడ్జి సమీపంలో శనివారం చోటు చేసుకుంది. మృతుడు చింతకాని మండలం నాగిలిగొండ గ్రామానికి చెందదిన చాట్ల భిక్షం(45)గా పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చాట్ల భిక్షం ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతిరోజు కొణిజర్ల మండల కేంద్రం నుంచి తన సొంత గ్రామం వరకు ఆటో సర్వీస్ చేస్తుంటాడు. శుక్రవారం అర్ధరాత్రి గోపవరం గ్రామ సమీపంలోని నేషనల్ హైవే బ్రిడ్జి పక్కన అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి వైరా ఏసీపీ రెహమాన్, సీఐ సాగర్, కొణిజర్ల ఎస్సై సూరజ్ చేరుకొని పంచనామా నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంటల నమోదు ప్రక్రియ పక్కాగా జరగాలి

కూసుమంచి డివిజన్ ఏడీఏ బీ సరిత

క్రాప్ బుకింగ్ సర్వేను పరిశీలిస్తున్న ఏడీఏ సరిత

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 8: పంటల నమోదు ప్రక్రియ పారదర్శంగా, పక్కాగా నిర్వహించాలని కుసుమంచి డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు బీ సరిత అన్నారు. శనివారం ఆమె మండల వ్యవసాయశాఖ అధికారి బీ ఉమానగేష్‌తో కలిసి మండలంలో పర్యటించారు. తొలుత వెంకటగిరి, గుదిమళ్ల గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో జరుగుతున్న పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ యాసంగీ సీజన్‌లో సాగు చేపట్టిన ప్రతి పంటను నిర్ధేశించిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని, ప్రతి భూమిలో, ప్రతి పంట వివరాలు స్పష్టంగా ఉండాలని ఆమె సూచించారు. సాగు చేసిన పంటల ఆధారంగానే దిగుమతులు అంచన వేయడం జరుగుతుందని, తద్వారా మార్కెటింగ్‌కు అనువైన సౌకర్యాలు కల్పించేందుకు గాను అవకాశం ఉంటుందన్నారు. అనంతరం గుదిమళ్ల, వెంకటగిరి గ్రామాల్లోని పురుగుమందుల షాపులను ఆమె తనిఖీ చేశారు. ఎరువుల క్రయవిక్రయాలు పూర్తిగా పాయింట్ ఆఫ్ సేల్ యంత్రాల సహాయంతోనే జరగాలనాన్నారు. స్టాక్ వివరాలు, ధరల పట్టికను విధిగా షాపుల్లో ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో గుర్రాలపాడు సెక్టార్ ఏఈవో ఆదర్శ్, రైతులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ అభ్యున్నతికి కృషిచేస్తా..

టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌రాజు

మాట్లాడుతున్న సంగంరెడ్డి సుందర్‌రాజు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 8 : రాష్ట్రంలో విద్యావ్యవస్థ దయనీయమైన స్థితిలో ఉందని, ఎడ్యుకేషన్ వ్యవస్థను మెరుగుపరచడానికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తానని ఖమ్మం, వరంగల్, నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజుయాదవ్ అన్నారు. ప్రచారంలో భాగంగా శనివారం ఖమ్మం వచ్చిన ఆయన అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయుల పరిస్థితి బతకలేక బడి పంతులు అన్న చందంగా ఉందన్నారు. విద్యా వ్యవస్థ బాగుంటేనే దేశం బాగుంటుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు టీచర్ల సమస్యల పరిష్కారానికి చట్టసభలో పోరాడేందుకు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని పేర్కొన్నారు. సమావేశంలో యాదవ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు చిత్తారు సింహాద్రియాదవ్, చిలకల వెంకటనర్సయ్య, వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కోటయ్య, సతీశ్, శ్రీనివాస్, ప్రభాకర్, మల్లేశ్, వెంకన్న, లింగరాజు, రవికుమార్ రమణ తదితరులు పాల్గొన్నారు.

రాజసాయి మందిరంలో వైద్యశిబిరం

పెనుబల్లి: వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు, సత్తుపలల్లి టౌన్: వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

పెనుబల్లి, ఫిబ్రవరి 8: మండలంలోని వీఎం.బంజర శ్రీరాజసాయిమందిరం ఆధ్వర్యంలో ఖమ్మం మమత మెడికల్ కళాశాల, సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు కిరణ్‌సాయి, వీ.జాహ్నవిరెడ్డి, కే.కిరణ్మయి, జనరల్ ఎండీ డాక్టర్ సీహెచ్.చందన, వీ.విశ్వజ, మేదరమెట్ల శృతి, సాధారణ శస్త్ర చికిత్స ఎంఎస్ డాక్టర్ కొండా శ్రీనిధి, ఉద్దురోజు దీపిక, వై.మానస, కంటి వైద్యులు పీఆర్‌వోపీ నాగేశ్వరరావు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. శిబిరంలో రాజసాయిమందిరం చైర్మన్ జెన్నారెడ్డి విజయ నర్సింహారెడ్డి, శ్యామల, జ్యోతి, మనోజ్‌రెడ్డి, వైద్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో వైద్యశిబిరం

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 8: కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు ఆదేశాల మేరకు ప్రాజెక్టు అధికారి ఎంవీ.నర్సింహారావు ఆధ్వర్యంలో అంబేద్కర్‌నగర్, కిష్టారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో శనివారం సింగరేణి వైద్యులు వైద్యపరీక్షలు చేశారు. సింగరేణి వైద్యురాలు శిరీష, కిష్టారం గ్రామ కార్యదర్శి రమణ, కిష్టారం వెల్ఫేర్ ఆఫీసర్ సందీప్, కిష్టారం గ్రామస్తులు పాల్గొన్నారు.

గౌడ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అమరగాని వెంకన్న

రఘునాథపాలెం, ఫిబ్రవరి 8: ఖమ్మం జిల్లా కేంద్రంలో గౌడ సంఘం జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ అమరగాని వెంకన్నగౌడ్ ఆధ్వర్యంలో శనివారం గౌడ జనహక్కుల పోరాట సమితి(మోకు దెబ్బ) క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బండి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి వెంకన్న మాట్లాడు తూ గౌడల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి తొలుపునూరి దానయ్య, మరికంటి వెంకట్, పంది శ్రీనివాస్, తాళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.లక్ష విరాళం

ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 8: పట్టణంలోని శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవానికి తోట వెంకట్రావు, బేబిసరోజిని జ్ఞాపకార్థం వారి కుమారు లు తోట రమేశ్ బాబు, జానకీ పద్మజాదేవి, వినయ్‌కిశోర్, దేవిశ్రీకీర్తి, మిరియాల నాగవెంకటసాయి, అభిషేక్, లక్ష్మీప్రీతి, లక్ష్మీజాన్వి కుటుంబ సభ్యులు రూ. 1,11,116లను శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ బాధ్యులు ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, వందనపు సత్యనారాయణ, ఆలయ వ్యవస్థాపకుడు రాగాల చంద్రారెడ్డి, చైర్మన్ సోమిరెడ్డి శ్రీధర్ పాల్గొన్నారు.

మహా ప్రదర్శన సభకు భారీగా తరలివెళ్లాలి

వ్యవసాయ కూలీలతో మాట్లాడుతున్న ఎన్డీ నాయకులు

కారేపల్లి, ఫిబ్రవరి 8: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చాలని ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా ప్రదర్శన సభను జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) మండల కార్యదర్శి వై.ప్రకాష్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పేరుపల్లి, జామాలపల్లి గ్రామాల్లో విస్తృతంగా ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా వివిధ రకాల సర్వేలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) నాయకులు కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, అలెం చంద్రయ్య, బుర్ర కోటమ్మ, సుగుణ, పద్మ, లక్ష్మి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన

వైరాటౌన్, ఫిబ్రవరి 8: వైరా నియోజకవర్గ కేంద్రంలోని ఆర్‌టీసీ బస్టాండ్ వెనుక ఉన్న రెండు ప్రధాన గేట్ల మూసివేతను నిరసిస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రయాణీకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు గేట్లు మూసివేతను ఎత్తివేయాలని బస్సుస్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌టీసీ బస్టాండ్ నిర్మాణం చేపట్టిన నాటి నుంచి బస్టాండ్‌కు నాలుగువైపులా రహదారులు ఉన్నాయని, అలాంటి రహదారి గేట్లను మూసివేయడం వలన మధిర రోడ్డులో రింగు రోడ్డు సెంటర్‌లో ట్రాఫిక్ రద్దీ పెరిగి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, వెంటనే మూసివేసిన గేట్లను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు నులిపురుగుల నివారణ దినోత్సవం

డాక్టర్ నవ్యకాంత్

సత్తుపల్లి, ఫిబ్రవరి 8: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం కల్లూరు మండలంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, విద్యార్థులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందని వైద్యులు నవ్యకాంత్ తెలిపారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ చిన్నారులకు ఈ మాత్రలు వేయించాలని సూచించారు. రక్తహీనత తగ్గి పోషణ మెరుగవుతుందని, మెరుగైన మానసిక, శరీర అభివృద్ధి, చురుకుదనం అందించేందుకు ఈ మాత్రలు ఉపయోగపడతాయన్నారు.

రేపు ఎయిడ్స్‌పై అవగాహన

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 8 : ఖమ్మం జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ నెల 10వ తేదిన హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. 84 పాఠశాలల నుంచి ఎంపిక విద్యార్థులు డైట్ కళాశాలలో జరిగే పోస్టర్ తయారీలో పాల్గొనాలని ఏఎంవో రవికుమార్ పేర్కొన్నారు. పోస్టర్ తయారీకి కావాల్సిన చార్ట్‌లు, రంగులు తెచ్చుకోవాలని సూచించారు.

11న దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు

సత్తుపల్లి, ఫిబ్రవరి 8: రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో వయోవృద్ధులకు చేతికర్రలు, వాకర్స్, వినికిడి యంత్రాలు, శారీరక దివ్యాంగులకు అవసరమైన ఛార్జింగ్ బ్యాటరీతో నడిచే ట్రైకిల్, కాలిపర్స్ కృత్రిమకాళ్లు అందించేందుకు సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 11న శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ నర్సింహారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 11వ తేదీ ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఈ శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. శిబిరానికి హాజరయ్యే వయోవృద్ధులు ఆదాయ ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, వయస్సు ధ్రువీకరణపత్రం, పాస్‌పోర్టుసైజ్ ఫొటోతో హాజరుకావాలన్నారు. శారీరక దివ్యాంగులు ఆదాయ ధ్రువీకరణపత్రం, రేషన్‌కార్డు,ఆధార్‌కార్డు, వైకల్య ధ్రువీకరణపత్రంతో శిబిరానికి హాజరు కావాలన్నారు.

టెన్త్ విద్యార్థులకు 11న టీశాట్ ద్వారా సూచనలు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 8 : జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఈ నెల 11వ తేదీ మంగళవారం టీశాట్, యూట్యూబ్ ద్వారా సబ్జెక్ట్ నిపుణులతో సూచనలు అందించనున్నట్లు డీఈవో సోమశేఖరశర్మ తెలిపారు. ఉదయం 10:30 గంటలకు పరీక్షలపై సన్నద్ధత, పరీక్ష ప్రశ్నపత్రాలపై విశ్లేషణ ఉంటుందన్నారు. తొలుత విద్యాశాఖ సెక్రటరీ డాక్టర్ యోగితారాణా, డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ప్రసంగిస్తారు. విద్యార్థులు సూచనలు వీక్షించేందుకు వీలుగా ప్రతి పాఠశాలలో ఐఎఫ్‌బీలు, కేయాన్, ప్రొజెక్టర్‌లు, టీవీలు ఏర్పాటు చేయాలని హెచ్ఎంలను ఆదేశించారు. టెలికాస్ట్ సమయంలో స్క్రీన్‌పై కనిపించే నంబర్లకు కాల్‌చేసి సందేహాలను తెలుసుకోవచ్చన్నారు. జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలిపి 424 స్కూల్స్ నుంచి టెన్త్ విద్యార్థులు 16,416 మంది హాజరుకానున్నారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

కూసుమంచి, ఫిబ్రవరి 8: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 11వ తగరతిలో ఉన్న ఖాళీలకు శనివారం నిర్వహిం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 480 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 398మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసు, ఎంఈవో పరీక్షా కేంద్రం చీఫ్ రాయల వీరాస్వామి తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా మంచినీరు, విద్యుత్, వైద్య సహాయం అందించామని తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎస్‌బీఐటీ విద్యార్థుల ఎంపిక

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 8 : ఖమ్మం నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలకు చెందిన విద్యార్థులు హైదరాబ